6 నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్లు

మూడు విడతల్లో సీట్ల భర్తీ

- **జూన్ 3న మొదటి విడత సీట్ల కేటాయింపు**
- **జూలై 8 నుంచి డిగ్రీ ఫస్టియర్ క్లాసులు ప్రారంభం**
- **నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి**

దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి , వైస్ చైర్మన్ వెంకటరమణ తదితరులు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)-2024 నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం మూడు విడతల్లో సీట్లను భర్తీచేస్తారు. ఈ నెల 6 నుంచి మొదటి విడత రిజిస్ట్రేషన్లు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు పొందేందుకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. జూన్ 3న మొదటి విడత సీట్లను కేటాయిస్తారు. మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత అడ్మిషన్లు పొందిన విద్యార్థులు జూన్ 29 నుంచి జూలై 7 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి 6 వరకు ఓరియంటేషన్ నిర్వహిస్తారు. జూలై 8 నుంచి ఫస్టియర్ క్లాసులు ప్రారంభమవుతాయి. ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్లు మహమూద్, వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్, ఓయూ, కాకతీయ, మహాత్మాగాంధీ, పాలమూరు, శాతవాహన, అంబేద్కర్ వర్సిటీల వీసీలు రవీందర్, రమేశ్, లక్ష్మీకాంత్ రాథోడ్, మల్లేశ్, సీతారామారావు పాల్గొన్నారు.

నాలుగు కొత్త కోర్సులు

ఈ ఏడాది డిగ్రీలో నాలుగు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నారు. 14 కాలేజీల్లో బీకాం ఫైనాన్స్, మరికొన్ని కాలేజీల్లో బీఏ (స్పెషల్) హెచ్‌ఈపీ, బీఎస్సీ బయోమెడికల్ సైన్స్, బీఏ పబ్లిక్‌పాలసీ అండ్ గవర్నెన్స్ కోర్సులను నిర్వహిస్తారు. 20 అటానమస్ కాలేజీల్లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ అండ్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ (బీఎఫ్‌ఎస్‌ఏ)ను ఎలక్టివ్‌గా ప్రవేశపెడుతున్నారు. బీఎఫ్‌ఎస్‌ఏ కోర్సులో 5వేల మంది ఇంజినీరింగ్, మరో 5వేల మంది నాన్ ఇంజినీరింగ్ కోర్సుల వారికి అడ్మిషన్లు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,066 డిగ్రీ కాలేజీలుండగా, వీటిల్లో 4,49,449 సీట్లున్నాయి.

	విషయం	మొదటి విడత	రెండోవిడత	మూడోవిడత
మూడు విడతల దోస్త్ షెడ్యూల్	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్	6-5-24 నుంచి 25-5-24	4-6-24 నుంచి 13-6-24	19-6-24 నుంచి 25-6-24
	వెబ్ ఆప్షన్లు	15-5-24 నుంచి 27-5-24	4-6-24 నుంచి 14-6-24	19-6-24 నుంచి 26-6-24
స్పెషల్ క్యాటగిరీ ప్రవేశాలు	పరిశీలన (పీహెచ్ , క్యాప్)	24-5-24	13-6-24	25-6-24
	ఎన్‌సీసీ, స్పోర్ట్స్ పత్రాల పరిశీలన	25-5-24	13-6-24	25-6-24
	సీట్ల కేటాయింపు	3-6-24	18-6-24	29-6-24
	సెల్ఫ్ రిపోర్టింగ్	4-6-24 నుంచి 10-6-24	19-6-24 నుంచి 24-6-24	29-6-24 నుంచి 3-7-24

కోర్సుల వారీగా సీట్లు

కోర్సు	సీట్లు
బీకాం	85,516
బీఏ	29,846
బీబీఏ	15,311
బీసీఏ	4,722
బీబీఎం	1,010
బీఎస్సీ లైఫ్‌సైన్సెస్	43,300
బీఎస్సీ ఫిజికల్ సైన్స్	26,011

అన్ని కోర్సులకు ఇంటర్న్‌షిప్ : బుర్రా వెంకటేశం

రాష్ట్రంలోని అన్ని కోర్సులకు ఇంటర్న్‌షిప్‌లు అమలుచేసే యోచన చేస్తున్నట్టు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తెలిపారు. ఇండస్ట్రీ వర్గాలతో సంప్రదించి కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. ప్లేస్‌మెంట్స్, ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయనిన్నారు. కొత్త కోర్సుల్లో బోధనకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని అమలుచేస్తామని చెప్పారు. ఈ కోర్సుల్లోని వారు ఆరు మాసాల పాటు పరిశ్రమల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. నాన్ దోస్త్ కాలేజీలను దోస్త్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

కోర్సుల మూత, సీట్ల కోతలేదు : లింబాద్రి

డిగ్రీలో కోర్సులను మూసివేయడం, సీట్ల కోత విధించడంలేదని ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి తెలిపారు. ఆదరణ లేని కోర్సులకు బదులు మరో కోర్సు ఆఫర్‌చేసే అవకాశం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంటర్‌లో 3 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారని, కానీ డిగ్రీలో 4లక్షలకు పైగా సీట్లున్న విషయాన్ని గుర్తుచేశారు.

27 ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు లక్ష చొప్పున జరిమానా

- **వేసవి సెలవుల్లో క్లాస్‌లు, అడ్మిషన్ల నిర్వహణ**
- **చర్యలు తీసుకొన్న ఇంటర్‌బోర్డు అధికారులు**

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు ఇంటర్‌బోర్డు షాక్ ఇచ్చింది. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహణతోపాటు ప్రవేశాల షెడ్యూల్ విడుదల కాకముందే అడ్మిషన్లు తీసుకొన్న 27 ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు రూ.లక్ష చొప్పన జరిమానా విధించింది. వీటిలో రెజోనెన్స్ విద్యాసంస్థకు చెందినవి 7, వశిష్ట 4, తపస్య 4, అర్బన్ జూనియర్ కాలేజీ 1, నారాయణ కాలేజీ -1 ఉన్నాయి. వేసవి సెలవుల్లో కొన్ని కాలేజీలు అడ్మిషన్లు, క్లాస్‌లు నిర్వహిస్తున్నాయని ఇంటర్‌బోర్డుకు ఫిర్యాదులందాయి. ఈ మేరకు అధికారులతో తనిఖీలు నిర్వహించి ఆయా కాలేజీలపై జరిమానాలు విధించింది. అయితే కార్పొరేట్ కాలేజీలను వదిలేసి చిన్నాచితకా కాలేజీలపై ఇంటర్‌బోర్డు అధికారులు ప్రతాపం చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. శ్రీచైతన్య, నారాయణ కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2.88 సెకన్లలో జడ్ టు ఏ టైప్

గిన్నిస్ రికార్డు సాధించిన హైదరాబాదీ అశ్రఫ్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన యువకుడు ఎస్‌కే అశ్రఫ్ 2.88 సెకన్లలో ఇంగ్లిష్ అక్షరాలు జడ్ నుంచి ఏ వరకు టైప్ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. అశ్రఫ్ ప్రతిభను గుర్తించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ బృందం ఈ ప్రక్రియను అంతా వీడియో తీసింది. ప్రస్తుతం ఈ వీడియోను వీక్షించిన నెటిజన్లు అశ్రఫ్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాలపై కేసు

విద్యానగర్, మే 3 : కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ మాటలను కాల్ రికార్డింగ్‌గా సృష్టించి డీప్ ఫేక్ వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారంటూ బీజేపీ నాయకుడు కొట్టె మురళీకృష్ణ కాంగ్రెస్ అభ్యర్థిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. మురళి ఫిర్యాదుపై కరీంనగర్ టూటౌన్ పోలీసులు వెలిచాల రాజేందర్‌రావుపై కేసు నమోదు చేశారు.

వరంగల్ నగరంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్. చిత్రంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి

- **బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్**
- **దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి ప్రచారం**

వరంగల్, మే 3 : కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని, వారికి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి వరంగల్ 11, 29వ డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రామన్నపేట, పాపయ్యపేట చమన్, పోతన నగర్, రంగంపేట ప్రాంతాల్లో ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో పెద్ద ఎత్తున యువత బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ పంటలకు నీరందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కరువు తెచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

భార్య మరణించిన 17 రోజులకే..

- **మనోవేదనతో కన్నుమూసిన ఎక్సైజ్ ఎస్సై**
- **రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఘటన**

కాశీప్రసాద్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 3: భార్య మరణించిన 17 రోజులకే భర్త కన్నుమూశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఎక్సైజ్ ఎస్సైగా పనిచేస్తున్న సాదుల కాశీప్రసాద్ (61) శుక్రవారం ఉదయం మరణించారు. స్థానికులు, ఎక్సైజ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన సాదుల కాశీప్రసాద్ మరికొన్ని రోజుల్లో రిటైర్ కానుండగా ఇటీవలే హైదరాబాద్ నుంచి ఎల్లారెడ్డిపేటకు బదిలీపై వచ్చారు. 17 రోజుల క్రితం అతడి భార్య సావిత్రి మరణించారు. అప్పటికే కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్న కాశీప్రసాద్ మనోవేదనతో బతుకు వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి భోజనం చేసి పడుకొన్న ఆయన నిద్రలోనే మరణించారు. ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమాకాంత్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాశీప్రసాద్‌కు కూతురు, కుమారుడు ఉన్నారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayIndia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.1, **NIT No.** C/E.29/TRD/SC/03/2024-25, **టెండరు నం.** C/E.29/TRD/SC/03/2024-25, తేది: 01.05.2024. **పనుల పేరు:** SC డివిజన్‌లో ప్రధాన స్టేషన్ యార్డ్ లిమిట్స్ వద్ద TRD ఆస్తులకు సంబంధించి స్టేషన్లు/SP/SSP/TSS వద్ద బహిరంగ భద్రత - విద్యుత్ భద్రత చర్యలు మెరుగుపరుచుట మరియు పెంచుట. **అంచనా వ్యయం:** రూ. 1,51,92,633.20/-, **పూర్తిచేయు కాలం:** 90 రోజులు, **ముగింపు తేది:** 24.05.2024న 15.00 గం.వరకు.

1) బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ **http:// ireps.gov.in**కు లాగిన్ కాగలరు.
2) టెండరుదార్లు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మ్యాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) టెండరు ఫారం ధర &బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కాగోరు టెండరు దారులందరు కోరబడుచున్నారు.
4) GSTIN ఐడెంటిఫికేషన్ నెం.లు పొందవల్సిందిగా మరియు తమ ఆఫర్లతో పాటు దాఖలు చేయవల్సిందిగా కాగోరు టెండరుదారులందరు కోరబడుచున్నారు.
5) టెండరు దాఖలుచేయు కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారు ఏదేని సవరణల (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీచెయ్యబడును) కొరకు గమనించగలరు..

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ / TRD/సికింద్రాబాద్

AU0521

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in దర్శించండి.

19, 20న జేఎన్టీయూలో హ్యాకథాన్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : జేఎన్టీయూకు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఆంత్రోపెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సంయుక్తంగా నెల 19, 20న హ్యాకథాన్ నిర్వహించనున్నట్టు ఆ వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు ఇన్నోవేషన్ ఐడియాల దాఖలుకు ఈ నెల 12 వరకు గడువు విధించామని సూచించారు. ఎంపికైన మొదటి మూడు ఇన్నోవేషన్లకు అవార్డులతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు జేఎన్టీయూ హైదరాబాద్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభాకర్‌రావు అరెస్టుకు వారెంట్ ఇవ్వండి

నాంపల్లి కోర్టులు, మే 3 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును అరెస్టు చేసేందుకు వారెంట్ జారీ చేయాలని కోరుతూ నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. పంజాగుట్ట పోలీసులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

రాష్ట్ర ఆవిర్భావం రోజే ‘టెట్’

- **సెలవు రోజు నిర్వహణపై నిరుద్యోగుల మండిపాటు**
- **సబ్జెక్టుల వారీగా పరీక్షల షెడ్యూల్ విడుదల**

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం. రాష్ట్రమంతా వైభవంగా జరుపుకొనే పండుగ. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్వరాష్ట్రం సిద్ధించిన రోజు టెట్ నిర్వహించాలని వివాదాస్పద నిర్ణయం తీసుకొన్నది. తెలంగాణ దాస్యశృంఖలాలు తెగింది.. ప్రజలు స్వేచ్ఛావాయువులను పీల్చుకున్నది జూన్ రెండో తేదీనే. వందలాది మంది అమరులను, వారి త్యాగాలను స్మరించుకొనేది ఇదే రోజు. ఈ దృష్ట్యా జూన్ 2న సెలవుగా పాటిస్తారు. కానీ రాష్ట్ర విద్యాశాఖ మాత్రం జూన్ -2 టెట్ పేపర్ -1 రెండు సెషన్లలో నిర్వహిస్తామని తాజాగా ప్రకటించింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో టెట్ నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు సబ్జెక్టుల వారీగా పరీక్షల షెడ్యూల్‌ను టెట్ కన్వీనర్ రాధారెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలను నిర్వహిస్తామని విద్యాశాఖ గతంలో ప్రకటించింది. తాజా షెడ్యూల్ ప్రకారం జూన్ 2తోనే పరీక్షలు ముగియనున్నాయి. జూన్ 3న పరీక్షలు నిర్వహించే అవకాశమున్నా జూన్ 2న పరీక్షలు నిర్వహించడంలో అత్యంత దారుణమని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

ఎమ్మెల్సీ ఎఫెక్ట్‌తో మూడు రోజులు విరామం

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో టెట్ పరీక్షల షెడ్యూల్‌లో అధికారులు స్వల్పమార్పులు చేశారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజుల పాటు టెట్ పరీక్షలకు విరామం ప్రకటించారు. దీంతో టెట్ జూన్ 3న కాకుండా జూన్ 2నే ముగియనుంది.

పరీక్షల షెడ్యూల్

పేపర్ల	తేదీలు
పేపర్ -2 గణితం, అండ్ సైన్స్	మే 20 నుంచి 22వరకు (మొత్తం ఆరుసెషన్లు)
పేపర్ -2 సోషల్ స్టడీస్ (మైనర్ మీడియం)	మే 24 (ఒక సెషన్)
పేపర్ -2 సోషల్ స్టడీస్	మే 24, మే 28, 29 (మొత్తం ఐదు సెషన్లు)
పేపర్ -1	మే 30, 31 (మొత్తం నాలుగు సెషన్లు)
పేపర్ -2 గణితం, అండ్ సైన్స్) మైనర్ మీడియం	1జూన్ (మొదటి సెషన్)
పేపర్ -1 (మైనర్ మీడియం)	1 జూన్ (రెండో సెషన్)
పేపర్ -1	2జూన్ (రెండు సెషన్లు)

ఢిల్లీలో ఎన్సీటీఈ చైర్మన్ యోగేశ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు

ప్రభుత్వం కోరితే టీచర్లకు టెట్ మినహాయింపు

- **పీఆర్టీయూ టీఎస్ నేతలతో ఎన్సీటీఈ చైర్మన్ యోగేశ్‌సింగ్**

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం కోరితే టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కల్పిస్తామని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) చైర్మన్ యోగేశ్ సింగ్ తమకు చెప్పినట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు తెలిపారు. శుక్రవారం వారు ఢిల్లీలో ఎన్సీటీఈ చైర్మన్ యోగేశ్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2010 కన్నా ముందు నియామకమైన 1-5 తరగతులు బోధించే టీచర్లు పదోన్నతి పొందేందుకు టెట్ నుంచి మినహాయింపునిస్తామని హామీనిచ్చినట్టు తెలిపారు. ఇన్ సర్వీస్ టీచర్లకు పదోన్నతులకు సంబంధించి విద్యాహక్కు చట్టంలోని మార్గదర్శకాలను సవరిస్తామని చెప్పినట్టు వారు పేర్కొన్నారు. ఇదిలావుండగా, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల పదోన్నతికి టెట్ అవసరంలేదని ఎన్సీటీఈ సభ్యదర్శి కేషాంగ్ వై షెర్పా స్పష్టం చేసినట్టు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీఎస్సీ), జాక్టో నేతలు తెలిపారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నేతృత్వంలోని ఉపాధ్యాయుల సంఘాల ప్రతినిధి బృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్సీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ యోగేశ్‌సింగ్, సభ్యకార్యదర్శి కేషాంగ్ వై షెర్పాలను వేర్వేరుగా కలిశారు. 2010 ఆగస్టు 23కు ముందు నియమితులైన టీచర్లు అదే స్థాయిలో పదోన్నతి పొందేందుకు టెట్ అవసరం లేదని కేషాంగ్ వై షెర్పా వివరణ ఇచ్చినట్టు నేతలు తెలిపారు.

ముగిసిన అటవీ క్షేత్రాధికారుల శిక్షణ

ప్రతిభ చూపిన అభ్యర్థులకు పతకాలు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో 9వ అటవీ క్షేత్రాధికారుల(ఎఫ్‌ఆర్‌వో) శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శుక్రవారం అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న ఎఫ్‌ఆర్‌వోల స్నాతకోత్సవం జరిగింది. 18 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న ఎఫ్‌ఆర్‌వోలు క్షేత్ర స్థాయిలో ఫారెస్ట్ అధికారులుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. మొత్తం 47మంది అభ్యర్థుల్లో..42 మంది గుజరాత్, నలుగురు జమ్ము-కశ్మీర్, ఒకరు లడక్‌కు చెందినవారు కాగా వీరిలో 11మంది మహిళా అధికారులున్నారు. ముఖ్యఅతిథిగా గుజరాత్ రాష్ట్ర అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్)యూడీ సింగ్, ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్) ఆర్‌ఎం డోబ్రియాల్ పాల్గొన్నారు. పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించిన అనంతరం శిక్షణలో ప్రతిభ చూపిన వారికి పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గుజరాత్‌కు చెందిన సురేశ్‌కుమార్ దేశాయ్ అత్యుత్తమ ప్రతిభ చూపి 7 బంగారు పతకాలు సాధించి టాపర్‌గా నిలిచారు. రోనక్ కేవడియా 6 బంగారు పతకాలు, 3 వెండి పతకాలను సాధించారు. ఇక్కడ పీసీసీఎఫ్ ఎల్యూసింగ్ మేరు, అకాడమీ సంచాలకులు ఎస్‌జే ఆశా పాల్గొన్నారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

సిద్దిపేట జిల్లాలో ఘటన

శివరాములు (ఫైల్)

గజ్వేల్, మే 3: పంట దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన అన్నమైన శివరాములు (40) తనకున్న 18 గుంటల వ్యవసాయ పొలంలో పచ్చిమిర్చి, కూరగాయలు చేయడంతోపాటు అతడి సోదరికి చెందిన 11 గుంటల విస్తీర్ణంలో బీర తోట వేశాడు. కూరగాయల సాగులో అనుకున్న విధంగా దిగుబడి రాకపోవడంతో పంటల కోసం చేసిన అప్పులతోపాటు కుటుంబ అవసరాలు, చిట్టీల కోసం చేసిన అప్పులను తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గతంలోనే రెండు గుంటలు అమ్మి అప్పులు తీర్చగా, ప్రస్తుతం రూ.5 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ క్రమంలో పొలానికి వెళ్తున్నానని భార్య భాగ్యకు చెప్పి గురువారం ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రయినా భర్త ఇంటికి రాకపోవడంతో ఇంటి పక్కనే ఉండే మరిది గణేశ్‌కు విషయం చెప్పింది. అతడు రాత్రి 10.30 గంటలకు పొలం వద్దకు వెళ్లి చూడగా ట్రాక్టర్ సైలెన్సర్‌కు శివరాములు ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. శివరాములు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై భువనేశ్వర్ రావు తెలిపారు. రైతు శివరాములు కుటుంబ సభ్యులను గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నర్సింలు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

బోయపల్లిలో తీరిన మంచినీటి సమస్య

‘నమస్తే’కు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 3 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ విలీన గ్రామమైన బోయపల్లిలో మంచినీటి సమస్య పరిష్కారమైంది. ‘సీఎం సొంత జిల్లాలో దాహం దాహం’ అన్న శీర్షికతో గురువారం ‘నమస్తే తెలంగాణ’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి వెంటనే లీకేజీలను గుర్తించి వాటిని సరి చేయించారు. దీంతో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా కావడంతో ఆ గ్రామంలో మంచినీటి సమస్య తీరిపోయిందని కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన నమస్తే తెలంగాణకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

చిక్కిన ‘ఎయిర్‌పోర్ట్’ చిరుత

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిసరాల్లో తీవ్ర కలకలం రేపిన చిరుత ఎట్టకేలకు చిక్కింది. నాలుగు రోజుల క్రితం ఎయిర్‌పోర్టు రన్‌వేపై చిరుత కనిపించిందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చిరుత కదలికలు సీసీ కెమెరాలకు చిక్కడంతో ఒక్కసారిగా కలకలం మొదలైంది. విమానాశ్రయంలోని ఎయిర్ క్రాఫ్ట్ రిపేర్ సెక్షన్‌లోని కంచెపై నుంచి దూకేందుకు చిరుత ప్రయత్నించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డుకాగా ఎయిర్‌పోర్టు సిబ్బంది వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారమందించారు. దీంతో అలర్ట్ అయిన ఫారెస్ట్ సిబ్బంది చిరుతను బంధించేందుకు 5 బోన్లలో మేకలను ఎరగా ఉంచి, 25 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. గొల్లపల్లి, బహదూర్‌గూడ తదితర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. గురువారం రాత్రి ఆహారం తినేందుకు వచ్చిన చిరుత బోనులో చిక్కడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చిరుతను జూపార్క్‌కు తరలించి వైద్య పరీక్షలు చేసిన అనంతరం నల్లమల అడవిలోకి తరలిస్తామని అధికారులు పేర్కొన్నారు.

దూరప్రాంత ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): దూరప్రాంత ప్రయాణికులకు టీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. 8 రోజుల ముందుగానే బుకింగ్ చేసుకుంటే రిజర్వేషన్ ఫీజును మినహాయిస్తున్నట్టు టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఎక్స్ వేదికగా శుక్రవారం వెల్లడించారు. ముందస్తు రిజర్వేషన్ కోసం http//tsrtconline.in వెబ్‌సైట్‌ని సంప్రదించాలని తెలిపారు. ఎంజీబీఎస్, జేబీఎస్, బీహెచ్‌ఈఎల్, నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రతి అరగంటకో బస్సు అందుబాటులో ఉంచుతున్నట్లు టీఎస్‌ఆర్టీసీ వెల్లడించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంకు బస్సు సర్వీసులు పెంచనున్నట్లు తెలుస్తోంది.

వామన్‌రావు దంపతుల హత్యపైసుప్రీంలో విచారణ

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): సంచలనం సృష్టించిన న్యాయవాది గట్టు వామన్‌రావు దంపతుల హత్యపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఆయన కుమారుడు కిషన్‌రావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సుందరేశ్, ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రస్తుతం నిందితులంతా బెయిల్‌పై ఉన్నారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ కేసును సీబీఐ లేదా సీఐడీతో విచారణ జరిపించేందుకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు చెప్పారు. దీంతో నిందితులను కూడా ప్రతివాదులుగా చేర్చి వారికీ నోటీసులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

4.31 కోట్ల విలువైన బంగారం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, మే 3 : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద రూ.4.31 కోట్ల విలువైన 5.694 కిలోల బంగారాన్ని హైదరాబాద్ జోనల్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. డీఆర్‌ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి 65పై కారులో నలుగురు వ్యక్తులు కోల్‌కతా నుంచి ప్రయాణం చేస్తున్నారు. పంతంగి టోల్‌గేటు వద్ద అధికారులు ఆపే ప్రయత్నం చేయగా.. తప్పించుకుపోయారు. అధికారులు వెంబడించి చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామం వద్ద అడ్డగించారు. కారును సోదా చేయగా 5.694 కిలోల తూకం చేసే 35 బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. వాటికి సంబంధించి వారు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో బంగారాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఎయిర్‌పోర్ట్‌లో భారీగా ఆభరణాలు పట్టివేత

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 3: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి దాదాపు 35 కిలోల బంగారు, 40 కిలోల వెండి ఆభరణాలను ఓమిని కారులో హైదరాబాద్ నగరానికి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు. ఆభరణాలకు సంబంధించిన పత్రాలు, బిల్లులు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని, ఏడుగురిని అదుపులోకి తీసుకొని శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించామని చెప్పారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎన్నికల స్క్వాడ్ అధికారులకు కేసును అప్పగించినట్టు ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రభాకర్‌రావు అరెస్టుకు వారెంట్ ఇవ్వండి

నాంపల్లి కోర్టులు, మే 3 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును అరెస్టు చేసేందుకు వారెంట్ జారీ చేయాలని కోరుతూ నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. పంజాగుట్ట పోలీసులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

రూ.60 కోట్ల మోసం.. దంపతుల అరెస్టు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : బ్యాంకు, ఫైనాన్స్, ప్రైవేట్ ఇన్వెస్టర్లను మోసం చేసిన కేసులో దంపతులను 11 ఏండ్ల తర్వాత సీఐడీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐడీ డీజీ శిఖాగోయెల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శ్ కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మణికొండ ఆంజనేయులు, అతడి భార్య రీటా 2013లో బాలానగర్ ఎస్బీఐ నుంచి రూ.27 కోట్ల రుణాన్ని తీసుకుని పరారయ్యారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో బాలానగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, కేసును సీఐడీకి బదిలీ చేశారు. వారి విచారణలో ఆంజనేయులు దంపతులపై హైదరాబాద్ సిటీలో 4 కేసులు, సైబరాబాద్ కమిషనరేట్‌లో ఓ కేసులో ఫైనాన్స్ కంపెనీలు, ప్రైవేట్ ఇన్వెస్టర్లను రూ.60 కోట్లకు మోసం చేసినట్లు తేలింది. 2013 నుంచి వీరు పరారీలో ఉండగా.. సీఐడీ డీజీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఆంజనేయులు దంపతులను బెంగళూరులో అరెస్టు చేసి, కూకట్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు.

6న టీఎస్ ఈసెట్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : బీటెక్ కోర్సుల్లో ల్యాటరల్ ఎంట్రీ కోసం (రెండోసంవత్సరంలో) నిర్వహించే టీఎస్ ఈసెట్‌ను ఈనెల 6న నిర్వహించనున్నట్టు సెట్ కన్వీనర్ పీ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకు హైదరాబాద్‌లో 4, తెలంగాణ జిల్లాల్లో 48, ఏపీలో 7 చొప్పున మొత్తం 99 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 24,272 మంది విద్యార్థులు ఈసెట్‌కు హాజరుకానున్నట్టు వెల్లడించారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ) : సరోజిని దామోదర ఫౌండేషన్ విద్యాదాన్ స్కాలర్‌షిప్‌లకు జూన్ 15లోపు www. vidyadhan.orgలో దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ ఏడాది పదోతరగతిలో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు 9663517131 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-3 ఉద్యోగాల భర్తీకి సమాంతర రిజర్వేషన్లు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,388 గ్రూప్-3 ఉద్యోగాల భర్తీకి సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయం తీసుకొన్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కొత్త బ్రేకప్ వివరాలను టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు పేర్కొన్నారు.